క్లుప్తంగా

డిప్యూటీ తహసీల్దార్‌గా విమోచన్



అయిజ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా విమోచన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకట్రావ్ పదోన్నతిపై ఇటీవల ఉండవెల్లికి తహసీల్దార్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు విధులు నిర్వహిస్తానని, ప్రజలు సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు.

సరిహద్దులో తనిఖీ

అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులో పోలీసులు పకడ్బందీగా తనిఖీ చేపడుతున్నారు. నియోజకవర్గంలోని అలంపూర్–ర్యాలంపాడు బ్రిడ్జి వద్ద ఎస్‌ఐ రమేష్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుల్తానాపురం గ్రామానికి చెందిన నాగార్జున్‌గౌడ్ వద్ద మద్యం లభించినట్లు తెలిపారు. గ్రామంలో తన బెల్టు షాప్‌లో విక్రయించడానికి అలంపూర్ నుంచి మద్యం తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. అతని వద్ద 15.1 లీటర్ల మద్యం వాటి విలువ రూ. 37,720లుగా పేర్కొన్నారు. మద్యంతో పాటుగా బైక్‌ను స్వాధీనం చేసుకోని అనుమతి లేకుండా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి



గట్టు: బీఆర్‌ఎస్ పార్టీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్‌లు తెలిపారు. గురువారం 'ఇంటింటికి కృష్ణన్న పలకరింపు' కార్యక్రమంలో భాగంగా బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీని మరో మారు ఆదరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధిక, ఉప సర్పంచ్ సువార్తమ్మ, ఎమ్మెల్యే కుమారుడు బండ్ల సాయిసాకేత్‌రెడ్డి, అంగడి బస్వరాజు, గోవిందు, రాఘవేంద్రగౌడు, రామకృష్ణ, రామునాయుడు, ఆంజనేయులు, సంతోష్, వీరేష్, తిప్పయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



గట్టు: మండలంలోని పెంచికలపాడు సమీపంలో గురువారం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. అయిజ మండలం చిన్నతాండ్రపాడుకు చెందిన సుధాకర్ ఆదేశాల మేరకు ట్రాక్టర్ డ్రైవర్ సత్యం ఇసుకను అక్రమంగా పెంచికలపాడు దగ్గర తరలిస్తున్న క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు దివాకర్, కృష్ణయ్యలు పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు సంబంధించి అనుమతి పత్రాలు చూపించక పోవడంతో ట్రాక్టర్‌ను గట్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్యాకేజీల కోసమే పార్టీ మారారు..

గద్వాల రూరల్: ఎంఐఎం తరుపున బంగి ప్రియాంక సుదర్శన్ 15వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొంది ప్యాకేజీల కోసమే బీఆర్‌ఎస్‌లో చేరారని ఎంఐఎం జిల్లా కార్యదర్శి అల్తాఫ్ హుస్సేన్, మండల అధ్యక్షుడు రఫీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలు ఎంఐఎం పార్టీపై విశ్వాసంతో ప్రజలు ఓట్లేసి గెలిపించారని, ప్యాకేజీల కోసం బీఆర్‌ఎస్‌లో చేరారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌లో చేరినంత మాత్రన ఎంఐఎం పార్టీకి ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. రాబోయే రోజుల్లో కాలనీ ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. ప్రజలు ఎంఐఎం పార్టీ వెంటే ఉన్నారన్నారు. సమావేశంలో ఇలియాస్, మొహమ్మద్ జానీ, అస్లాం, అమ్జద్ ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



అయిజ: పట్టణ సమీపంలోని స్వయంభు కట్టకింద తిమ్మప్ప స్వామి ఆలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామివారి ఉత్స విగ్రహాలను గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి నామస్మరణతో మార్మోగింది. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రయాణికులు ఫుల్.. సౌకర్యాలు నిల్



ప్రయాణికులతో రద్దీగా ఎర్రవల్లి కూడలి

- మండుటెండలో బస్సుల కోసం ఎదురుచూపు
- మహిళల బాధలు వర్ణనాతీతం
- కనీస వసతులు కల్పించాలని వినతి

ఎర్రవల్లిచౌరస్తా: సినిమా హీరో కోసమో లేక చీఫ్ మినిస్టర్ కోసమో రోడ్డు పక్కన ఎండలో వరుసగా నిలబడి ఎదురుచూసే అభిమానులు ఎందరో ఉంటారు కానీ, మండుటెండలో ఆర్టీసీ బస్సుల కోసం రోడ్లపై ఎదురుచూసే ప్రయాణికులు మాత్రం చాలా మంది ఉంటున్నారు. ఇటిక్యాల మండలం ఎర్రవల్లిచౌరస్తాలో ఎటుచూసినా ప్రతిరోజు ఇదే దుస్థితి కనపడుతుంది.

నిత్యం ప్రయాణికుల రాకపోకలు

ఎర్రవల్లిచౌరస్తా నుంచి నిత్యం వివిధ ప్రాంతాలకు ప్రయాణించేందుకు వేల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. ముఖ్యంగా కర్నూలు, హైదరాబాద్, గద్వాల వైపు వెళ్లేందుకు బస్సుల కోసం ఎదురుచూస్తూ ఎండకు తాళలేక ఏదైనా షాపు నీడకు నిల్చుందామంటే తమ వ్యాపారానికి ఇబ్బందవుతుందని షాపుల యజమానులు చీదరించుకుంటున్నారు. మహిళా ప్రయాణికులు, విద్యార్థినీల పరిస్థితి మాత్రం మరీ అధ్వానంగా ఉంది. ఎండలో రోడ్డుపై నిలబడలేక నీడకోసం ఎటూ పోలేక సతమతమవుతున్నారు. మహిళలకు కూడలిలో కనీసం టాయిలెట్స్, మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చౌరస్తాలో వసతులు లేకపోవడంతో అధికారులపై, ప్రజాప్రతినిధులపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు..

నిత్యం రద్దీగా ఉండే ఎర్రవల్లిచౌరస్తాలో ఆర్టీసీ బస్టాండు లేకపోవడం సమస్యగా మారింది. ఆర్టీసీకి ఆదాయంపై ఉన్న శ్రద్ధ కంటే ప్రయాణికుల కోసం మౌలిక వసతులను కల్పించడంలో లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూడలిలో కనీస వసతులను కల్పించడంలో కూడా దృష్టి పెట్టలేకపోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం మహిళలు చీరకొంగులను, యువతులు చున్నీలను, విద్యార్థులు పుస్తకాలను, ఉద్యోగులు బ్యాగులను నెత్తిన పెట్టుకొని వేడి నుంచి కాస్త ఉపశమనం పొందుదూ దర్శనమిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి త్వరగా సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించాలి..



ఎర్రవల్లి కూడలిలో బస్సుల కోసం మండుటెండలో నిల్చోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. కనీసం బస్సులు ఆగే దగ్గర ప్రయాణికులకు నిల్చోవడానికి నీడ కరువైంది. ఎండను తాళలేక నెత్తిన బ్యాగును పెట్టుకొని నిలబడుతున్నాను. ఐదు నిమిషాలు కూర్చుందామంటే కూడా ఎంలాంటి వసతి లేదు. అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలి.

– రాజాచారి, ప్రయాణికుడు

అధికారులకు చాలాసార్లు విన్నవించాం..



నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ఎర్రవల్లి కూడలిలో కనీస వసతులు టాయిలెట్స్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించాం. ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీనివల్ల నిత్యం ప్రయాణికులు మాత్రం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

– జోగుల రవి, సర్పంచ్, ఎర్రవల్లి



హైదరాబాద్ రోడ్డులో బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



గద్వాల రోడ్‌లో ఎండను తాలలేక కిరాణం షాపు ఎదుట నిల్చున్న ప్రయాణికులు

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి

- డీపీఎం విలాసరావు

మల్దకల్: బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీపీఎం విలాసరావు తెలిపారు. గురువారం మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని డీపీఎం సందర్శించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మండలంలోని మొత్తం 179 మహిళా సంఘాలకు రూ.12 కోట్ల రుణాలుగా ఇప్పించడం జరిగిందని తెలిపారు. నెలాఖరు వరకు మిగిలిన సంఘాలకు మరో రూ.కోటి బ్యాంకు ద్వారా రుణాలను ఇప్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు సకాలంలో చెల్లించి, కొత్త సంఘాలకు రుణాలు అందించే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, సిబ్బంది పాల్గొన్నారు.



మల్దకల్‌లో మాట్లాడుతున్న డీపీఎం

బెల్ట్ షాపులపై దాడులు

మానవపాడు: ఎన్నికల నైపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో బెల్ట్‌షాపులను గురువారం తనిఖీ చేసి మద్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో లా అండ్ ఆర్డర్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన బెల్ట్ షాపులలో మద్యం అమ్మిన కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీలో పోలీసులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



గద్వాల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. కన్యకా పరమేశ్వరి, బాలాజీ వీధిలోని శివాలయంలో, కాళికా మాత, కుమ్మరి వీధి, రాంనగర్‌లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. నడిగడ్డ ఇలవేల్పు జమ్ములమ్మ ఆలయంలో అమ్మవారు పార్వతిదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. కోటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో అమ్మవారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. బాలాజీవీధిలోని శివాలయంలో సరస్వతీ దేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని నాయకులు దర్శించుకున్నారు. వడ్డెరవీధి, అశోక్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

అన్నపూర్ణాదేవిగా వాసవీమాత



మల్దకల్‌లో అన్నపూర్ణా దేవి అలంకరణలో వాసవీమాత

మల్దకల్: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంఘం నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం శ్రీనివాసులు, నాగరాజు, ప్రవీణ్‌కుమార్, చిన్న నర్సింహయ్య, వెంకటేష్, రాఘవేంద్రశెట్టి, రాజు, రామక్రిష్ణ, సురేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మహాచండీదేవిగా అమ్మవారు



గట్టు: మండల కేంద్రంలోని భవానీ మాత ఐదో రోజు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భవానీ మాతకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. గట్టుకు చెందిన మహిళలు ఆలయం దగ్గర అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కోట్లగేరి కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

పార్వతీదేవిగా అమ్మవారి దర్శనం

ధరూరు: మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కళశ పూజ, కుంకుమార్చన, గణపతి పూజ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు ఆలయ అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు. ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం డీఆర్ శ్రీధర్, డీఆర్ మంజుల దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు.

లలితాదేవిగా..

రాజోళి: మండలంలో అమ్మవారు లలితాదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబా భవానీమాత ఆలయంలో అమ్మవారి విగ్రహాలను లలితాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చన, అభిషేకాలు చేశారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గామాత అన్నపూర్ణాదేవిగా, జ్ఞానసరస్వతి ఆలయంలో సరస్వతీదేవి ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



అయిజ: మండల కేంద్రంలో కాళికాదేవి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, అంబా భవానీ ఆలయాల్లో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించారు. భక్తులు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రవల్లిక మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

గద్వాల అర్బన్: గ్రూప్–1, గ్రూపు –2, డీఎస్సీ పరీక్షలు వాయిదా పడడంతో ఉద్యోగం రాదని మనస్థాపంతో ప్రవల్లిక ఆత్మహత్య చేసుకున్నదని, దీనిని తప్పుదోవ పట్టించేందుకు పోలీసులు, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ మాట్లాడడం సరికాదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అన్నారు. ప్రవల్లిక మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాష, కార్యదర్శి హరీష్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, చందు, రవితేజ ఉన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

గద్వాల అర్బన్: మధ్యాహ్న భోజన వర్కర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో డీఈఓ సీరాజుద్దీన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు మెనూ, ఎగ్ బిల్లులు, జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. టిఫిన్ నిర్వహణకు పాత్రలు సప్లై చేయాలని, నెలకు జీతం రూ.18వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మద్దిలేటి, మురళీధర్, కృష్ణయ్య, రాములు, భాగ్యలక్ష్మి, పుల్లమ్మ ఉన్నారు.



ఐడీఓసీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

గద్వాల అర్బన్: మదాసి కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కురువ విజయ్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం మదాసి కురువ, మదారి కురువ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ అనేక ఉద్యమాలు చేస్తూ జైలు కెళ్లిన విజయ్‌కుమార్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మదాసి కురువ సంఘం నాయకులు రామ్‌కుమార్, జగదీష్, రాజు, ప్రసాద్, వెంకటేష్, వెంకట్రాముడు, రమేష్, శ్రీను ఉన్నారు.

శాంతినగర్: తెలంగాణ మదాసి, మదారి కురువ సంఘం అధ్యక్షుడు కురువ విజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌పార్టీ నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆ పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శాంతినగర్ అంబేద్కర్ చౌరస్తాలో గురువారం దగ్ధం చేశారు. దశాబ్దకాలంగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ తరపున ఎన్నో ఉద్యమాలు చేస్తూ కేసులు అనుభవిస్తున్న విజయ్‌కుమార్ పట్ల రేవంత్‌రెడ్డి మొండి వైఖరితో వ్యవహరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మదాసి కురువ సంఘం యువజన నాయకులు తిక్కయ్య, మధు, విజయ్, కృష్ణ, ప్రసాద్, వెంకటేష్, వెంకట్రాముడు, రమేష్, శ్రీను, జయరాముడు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కురువసంఘం నాయకులు

రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన

ధరూరు: సమైక్య పాలనలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేదని, పక్కనే కృష్ణ, తుంగభద్ర నదులున్నా, తాగు, సాగు నీటికి అల్లాడిపోయామని, ఇప్పుడు రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన అందిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతుందని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అన్నారు. గురువారం మండలంలోని కోతులగిద్ద, కొత్తపాలెం, కొత్తపాలెం తండా, మార్లబీడు, ర్యాలంపాడు, ఓబులోనిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచులు మహబూబ్, రమేష్, మండల అధ్యక్షులు డీఆర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కొత్తపాలెంలో మాట్లాడుతున్న బండ్ల జ్యోతి

నిఘా మరింత కట్టుదిట్టం : ఎస్పీ

ధరూరు: ఎన్నికల కోడ్ అమలును దృష్టిలో ఉంచుకుని నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని, నగదు తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచాలని మండల పోలీసులను ఎస్పీ రితిరాజ్ ఆదేశించారు. గ్రామాల్లో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక తనిఖీలు చేపట్టి లభించిన నగదును సీజ్ చేసి తగిన ఆధారాలు ఉండే తిరిగి ఇవ్వాలన్నారు. రూ.50వేలకు మించి నగదును తీసుకు వెళ్లకూడదన్నారు. గ్రామాల్లో రౌడీ షీటర్లు ఉంటే గొడవలు జరగకుండా చూడాలన్నారు. అవసరమైతే వారిని బైండోవర్ చేయాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యటించి సమాచారం తీసుకోవాలని ఎస్‌ఐ శివానదం గౌడ్‌కు సూచించారు. ప్రత్యేకంగా బెల్టుషాప్‌లపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ వెంకట్రాములు పాల్గొన్నారు.



ధరూరులో పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ రితిరాజ్

ఊరి కోసమే సేవా సమితి

శాంతినగర్: ఉన్న ఊరికి ఉపకారం చేయాలనే సంకల్పంతో శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి పనిచేస్తుందని సేవా సమితి సభ్యులు అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో సేవా సమితి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. 2019 అక్టోబర్ 19 సేవా సమితి ఏర్పడిందని, ఐదేళ్ల కాలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. సేవా సమితికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరిస్తున్న అందరికీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. సేవా సమితి పేరుతో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు మెచ్చిన పట్టణ వాసులు సభ్యులకు మెమెంటోలు, శాలువాలు కప్పి అభినందించారు.



సేవా సమితి సభ్యులను అభినందిస్తున్న పట్టణవాసులు

పిచ్చికుక్క స్వైరవిహారం

గద్వాల క్రైం: గద్వాల మండలంలోని గోనుపాడులో గురువారం ఆరుగురిపై పిచ్చికుక్కలు స్వైరవిహారం చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు గమనించి కుక్కలను చెదరగొట్టారు. వెంటనే చిన్నారి, కిషోర్, రాజు, పవని, దేవేందర్‌లను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు వారికి ప్రథమ చికిత్స అనంతరం టీకాలను అందించారు.